క్లుప్తంగా

నేడు అయితానగర్‌లో పాదయాత్ర

తెనాలి అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణం అయితానగర్‌లోని 1, 2, 39 వార్డుల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్



తెనాలి: స్థానిక కొత్తపేటలోని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. క్యాడేట్ వెల్ఫేర్ సొసైటీ ఎన్‌సీసీ విద్యార్థులకు ఏటా బహుకరించే జాతీయ మెరిట్ అవార్డులను అందచేస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాలి తెలియజేశారు. ఈ ఏడాది ప్రకటించిన వాటిలో తమ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు టి.హేమలత, షేక్ బుజ్జి, కె.వెంకటసాయి ఫణీంద్ర, పి.వశిష్ట ఎంపికైనట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఒక్కొక్కరికి రూ.6000 చొప్పున చెక్కులను 22వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ మనోజ్‌కుమార్ శనివారం అందించినట్లు మౌలాలి చెప్పారు. ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని, తగిన ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయని పాఠశాల ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ చెప్పారు. గత ఏడాది కూడా తమ పాఠశాలకు నాలుగు మెరిట్ స్కాలర్‌షిప్‌లు వచ్చాయని గుర్తు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు.

పెన్షనర్లకు ఉచిత మెగా వైద్యశిబిరం



తెనాలి: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులకు తెనాలి హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని అసోసియేషన్ హాలులో జరిగిన శిబిరంలో 65 మందికి ఉచితంగా బీపీ, మధుమేహం, ఎముకల పటుత్వ పరీక్షలు చేసి, అవసరమైన సలహాలిచ్చారు. వృద్ధాప్యంలో వచ్చే మోకాలు అరుగుదల సమస్యలు, పీఆర్‌పీ, హైలురోనిక్ ఆసిడ్ (గుజ్జు) ఇంజక్షన్ ప్రాముఖ్యతపై ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ బీఎల్‌వీఎస్ ప్రసాద్ అవగాహన కల్పించారు. హెల్త్ హాస్పిటల్ సీఈవో గిరిబాబు, డాక్టర్ లక్ష్మణ్, వలి, మురళి, జీవన్, రామారావు పర్యవేక్షించారు.

నేడు మహంకాళేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని మహంకాళేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం వేదపండితులతో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ మండపారాధన పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం కాళీమాతకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేస్తారన్నారు. చండీహోమం, కోటి కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శనివారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 205 మంది రోగులకు ఆరోగ్య సిబ్బంది షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. వైద్యురాలు శ్వేత రోగులను పరిశీలించి మందులు అందజేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎం మాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన మాణిక్యాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం
- అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థుల విజయభావుటా

తెనాలి అర్బన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్యతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకుంటూ ప్రభుత్వ పాఠశాలలు ముందుకు పోతున్నాయి. గతేడాది పదో తరగతి పరీక్షల్లో తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 58.7 శాతంగా నమోదైంది. ఈ ఏడాది 69.6 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం ప్రతి ఏడాది పెరుగుతోందని చెప్పవచ్చు. తెనాలి పట్టణ, మండల పరిధిలో మొత్తం 16 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో ఈఏడాది పదో తరగతి చదివిన వారి సంఖ్య మొత్తం 1320 మంది ఉన్నారు. తెనాలి పట్టణ పరిధిలో ఆరు మున్సిపల్ హైస్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్ బాలుర స్కూల్ ఒకటి, బాలికల స్కూల్ ఒకటి ఉన్నాయి. వాటిలో పదో తరగతి విద్యార్థులు 751 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే తెనాలి మండల పరిధిలో ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 569 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

విద్యార్థులకు అవసరమైన వసతులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, యూనిఫాం, షూస్, సాక్సులు, డిక్షనరీలు, ట్యాబ్‌లు వంటి వాటిని అందించారు. అలాగే విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిక పౌష్టికాహారాన్ని అందించటం, వారికి అవసరమైన టాయిలెట్స్, రక్షిత మంచినీరు, అదనపు తరగతి గదులు వంటి వాటిని ఏర్పాటు చేయటంతో నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు అయ్యాయి.

దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతూ వస్తోంది. గత ఏడాది తెనాలి పరిధిలో 9వేల మంది విద్యను అభ్యసిస్తే ఈఏడాది 10,403 మంది విద్యను అభ్యసించారు. దీనిని బట్టి చూస్తే పాఠశాలల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని చెప్పవచ్చు.



పదో తర గతి ఫలితాల్లో ప్రథమస్థానంలో నిలిచిన మున్సిపల్ బాయ్స్ హైస్కూల్

స్కూల్స్ వారీగా ఉత్తీర్ణత శాతం

స్కూల్‌పేరు	గత ఏడాది ఉత్తీర్ణత శాతం	ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం
తెనాలి బాయ్స్‌హైస్కూల్	56.8	70.3
జడ్పీహెచ్‌ఎస్, నందివెలుగు	50.0	87.1
జడ్పీహెచ్‌ఎస్, ఖాజీపేట	80.6	82.5
జడ్పీహెచ్‌ఎ స్, అంగలకుదురు	58.9	84.9
జడ్పీహెచ్‌ఎస్, కొలకలూరు	54.1	52.8
జడ్పీహెచ్‌ఎస్, పెదరావూరు	48.5	61.2
జడ్పీహెచ్‌ఎస్, సంగంజాగర్లమూడి	61.7	67.2
జడ్పీహెచ్‌ఎస్, కఠెవరం	53.7	57.8
జడ్పీహెచ్‌ఎస్, బుర్రిపాలెం	63.6	65.6
టీఎస్‌ఆర్‌హెచ్‌ఎస్,గంగానమ్మపేట	73.8	70.2
ఎన్‌ఎస్‌ఎస్‌హెచ్‌ఎస్, ఐతానగర్	73.5	70.4
గర్ల్స్ హైస్కూల్, కొత్తపేట	90.8	84.8
కె.ఎస్.ఎం.హెచ్, చెంచుపేట	40.3	71.6
ఎన్‌సీఆర్‌ఎన్‌హెచ్‌ఎస్, మారీసుపేట	50.6	54.9
ఏపీ బాయ్స్ స్కూల్	33.3	50.0
ఏపీ గర్ల్స్ స్కూల్	45.0	82.6

పై పట్టికను పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ప్రతి ఏడాది పెరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

విద్యాబోధన బాగుంది



కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పదోవ తరగతి చదివాను. 600 మార్కులకు గాను 582 మార్కులు వచ్చాయి. తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. ఉపాధ్యాయులు విద్యాబోధన, తల్లిదండ్రుల ప్రోత్సహం వల్లే ఇంతటి విజయాన్ని సాధించగలిగాను. ప్రభుత్వ పాఠశాలల్లోని క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు అందరికి అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు. అంతేకాకుండ అందరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

– హర్షవర్ధన్, 10వ తరగతి, మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, తెనాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు



ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కనీస వసతులు కన్పించేవి కావు. నేడు ఆ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, విద్యకు అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ఉపాధ్యాయులు కూడ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. స్టడీ అవర్స్, రివిజన్ చేయటం, అర్థం కాని సబెక్టులకు ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. దీనివల్ల నేను పదో తరగతి ఫలితాల్లో 578 మార్కులతో రెండో స్థానంలో నిలవగలిగా.

– ఆర్ తన్మయ, జిల్లా పరిషత్ హైస్కూల్, పెదరావూరు, తెనాలి మండలం

హోం ఓటింగ్‌లో పోలైన 178 ఓట్లు



తెనాలి: ఎన్నికల సంఘం అమల్లోకి తీసుకొచ్చిన హోమ్ ఓటింగ్ ప్రక్రియలో తెనాలి నియోజకవర్గంలో శనివారం 178 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ కోసం 85 ఏళ్లు నిండినవారు, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. అలాంటివారు నియోజకవర్గంలో మొత్తం 352 మంది 12-డీ ఫారంతో దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 3వ తేదీనుంచి అధికారులు వారి ఇళ్లవద్దకే వెళ్లి ఓటింగ్ చేయిస్తున్నారు. ఇందుకోసం 13 బృందాలు పనిచేస్తున్నాయి. తెనాలి నియోజకవర్గంలో తొలిరోజున 166 మంది ఓటు వేయగా, రెండోరోజైన శనివారం 178 మంది ఓటు చేశారు. అంటే ఇప్పటికి 344 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈనెల 8వ తేదీవరకు హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించారు.

కొనసాగిన హోం ఓటింగ్

తెనాలి రూరల్: ఎన్నికల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ ప్రక్రియ తెనాలి నియోజకవర్గంలో రెండో రోజు కొనసాగింది. మొత్తం 352 మంది ఫారం 12-డితో దరఖాస్తు చేసుకోగా తొలి రోజు శుక్రవారం 166 మంది ఓటు హక్కు వినియోగించుకోగా రెండో రోజు శనివారం 178 మంది తమ తమ ఇళ్ల వద్దే ఓటు వేశారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం

తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర: కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించి తెనాలి, కొల్లిపర గడ్డపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని వైఎస్సార్‌సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం కొల్లిపర పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం కళ్యాణ మండపంలో ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం, జగన్ కోసం సిద్ధం కార్యక్రమం పై వివిధ గ్రామాల పార్టీ నాయకులు, గృహసారథులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, ,బూత్ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తన విజయం ఎప్పుడో నిర్ణయమైందన్నారు. ఈ సారి కూడా కొల్లిపర మండలంలో అత్యధిక మెజారిటీతో పార్టీ జెండా ఎగరాల్సిందేనన్నారు. మీలో ఉన్న విబేధాలను పక్కన పెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ని మళ్లీ సీఎం చేయడానికి ప్రతి ఒక్కరూ శాతశక్తులా కృషి చేయాలని కోరారు. ఇప్పటి వరకు మనం పడిన కష్టం ఒక ఎత్తయితే ఈ వారం రోజులు పడే కష్టం మరొక ఎత్తన్నారు. మనం కష్టపడి ప్రతి ఓటర్‌ను పార్టీ నాయకులు, గృహసారథులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు మూడు సార్లు తప్పనిసరిగా కలవాలన్నారు. మొదటిసారి కలిసినప్పుడు జగనన్న మేనిఫెస్టో వివరంగా చెప్పాలని , రెండోసారి ఈవీఎంలో ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే , ఎంపీ అభ్యర్థుల ఓటు కొరకు రెండు ఫ్యాన్ గుర్తుపై ఏ విధంగా నొక్కాలో ఓటరుకు తెలియచేయాలన్నారు. మూడోసారి కలసినప్పుడు ఓటరుకు ఓట్లు స్లిప్ అందించాలని, ఈ కార్యక్రమం 10 వ తేదీ లోపు ప్రతి ఓటరు దగ్గరకు వెళ్లి తెలియచేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. తెనాలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనపై ప్రతి నాయకులు, కార్యకర్తలు వారం రోజులు విస్తృతంగా ప్రచారం చేయాలని, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. యువత పార్టీ కోసం కష్టపడి పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన అన్నాబత్తుని శివకుమార్‌ని మళ్లీ గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈవీఎం మిషన్లలో బటన్ ఎలా నొక్కాలో అవగాహన కల్పించి వివిధ అంశాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, గృహసారథులు, జేసిఎస్ కన్వీనర్స్, సచివాలయం కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

బడుగు వర్గాల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యం

జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కఠెవరపు దేవానంద్



ఇంటింటి ప్రచారం చేస్తున్న జైభీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యపడుతుందని జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కఠెవరపు దేవానంద్ అన్నారు. జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెనాలి మండలం నందివెలుగు, ఎరుకలపూడి గ్రామాల్లో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు వివిధ గ్రామాల్లో తమ ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు సమకూరిన సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఎస్. సుమతి, గోవ కుమారి, నాగమల్లేశ్వరి, రామారావు పాల్గొన్నారు.

ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం



దర్శకుడు ఉమామహేశ్వరరావుకు దాసరి పురస్కారం ప్రదానం

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో సినీపరిశ్రమ అభివృద్ధి మాత్రమే తమ ముందున్న లక్ష్యమని ఆంధ్ర దర్శకులు వెల్లడించారు. మా–ఏపీ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ నిర్వహించిన దర్శకుల దినోత్సవంలో వారు పాల్గొన్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి రోజును దర్శకుల దినోత్సవంగా మా–ఏపీ నిర్వహించింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు దర్శకులను దాసరి పురస్కారాలతో సత్కరించింది. స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. దర్శకరత్న దాసరి నారాయణరావు స్మారక పురస్కారాన్ని అంకురం, మౌనం, శ్రీకారం, చిత్రాల దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత సి.ఉమా మహేశ్వరరావు, 40 సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు భరత్ పారేపల్లికి బహూకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్ చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కే మరి కొందరు సినీదర్శకులు 'డాడీ' శ్రీనివాస్, ఓ.సాయి, బి. సోమసుందరం, చలవాది శివప్రసాద్‌లకు మా–ఏపీ గౌరవ సత్కారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో చిత్రీకరించిన సినిమాలకు ప్రభుత్వం లోకేషన్లను ఉచితంగా ఇస్తోందని గుర్తుచేశారు. దర్శకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే రాష్ట్రంలో షూటింగ్‌లు నిర్విరామంగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. వర్ధమాన హీరోయిన్లు దివిజ, మౌనిక రెడ్డి, టీనా చౌదరిని మా–ఏపీ సత్కరించింది. తొలుత చిన్నారి గ్రీష్మశ్రీ భరతనాట్య ప్రదర్శన చేయగా మానసిక వైద్యులు డాక్టర్ ఐనంపూడి శరత్ బాబు దర్శక దినోత్సవ ప్రత్యేక గీతాన్ని ఆలపించారు. దర్శకుడు కనపర్తి రత్నాకర్ ప్రారంభించగా నటుడు మిలటరీ ప్రసాద్, శ్రీకాంత్, వెంకీ రావణ్ పర్యవేక్షించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేసవి నేపధ్యంలో పూడుకుపోయిన కాలువల్లో అడ్డుగా ఉన్న షిల్ట్ తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలానికి ముందే పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేసి మురుగు నీటి నిల్వలు లేకుండా చేయడం జరుగుతుందని కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరి వాస్తవ్యులు లంకా జగదీష్ బాబు, సమ్య దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు విరాళ నగదు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష



ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



9వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక

- ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్
- 8,9,10,11 వార్డుల్లో రోడ్డు షోకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

తెనాలి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలందరికి శ్రీరామరక్ష అని, అవి కొనసాగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అందరూ ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ కోరారు. పట్టణంలోని 8,9,10,11 వార్డుల్లో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా శివాజీచౌక్ వద్ద ఉన్న కాళీమాత దేవస్థానంలో ఆయన పూజలు చేశారు. అనంతరం ఆయనకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తాడిబోయిన రమేష్ దంపతులు ఘనస్వాగతం పలికి భారీ గజమాలతో సన్మానం చేశారు. అనంతరం అక్కడి నుంచి బుర్రిపాలెం రోడ్డు, గాంధీపార్కు మీదుగా నాజర్‌పేటకు రోడ్డు షో చేరింది.అక్కడి నుంచి 9వ వార్డుకు రోడ్డు షో చేరుకుంది. అక్కడ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ వీరిశెట్టి శివనాగ మల్లేశ్వరి, పార్టీ నాయకులు వీరిశెట్టి భాస్కర్ దంపతులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అలాగే ఆయనను సన్మానించారు. అక్కడ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తిరుమలశెట్టి సాంబ్రాజ్యం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు దంపతులు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కఠారి హరీష్ దంపతులు ఆయనకు ఘనస్వాగతం పలికి భారీ గజమాలతో సన్మానించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, గుంటూరు కోటేశ్వరరావు, తోట రఘురామ్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, కొమరబత్తిన జయపాల్, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, దాసరి వీరవసంతరావు, కొర్ర యశోద, కో–ఆప్షన్ సభ్యుడు పెబ్బింగ్ సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, అత్తోట శ్యామ్, ఆస్రిన్, రాజ్యలక్ష్మి, మన్నవ ప్రభాకర్, బూరెల దుర్గా, షేక్ మీరావలి, చుండూరు సాయి, తాడిబోయిన బుజ్జి, గుంటూరు గోపి, కావేటి ఈశ్వరరావు, పెసర్లంక రమణ, కాశిదాసు వెంకటేశ్వరరావు, మల్లిబోయిన రాము, తాడిబోయిన పోలురాజు, చింకా సురేష్‌యాదవ్, నాగూర్ బాషా, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కుక్కల ముక్తేశ్వరరావు, కాకి దేవసహాయం, నీలి అజయ్‌కుమార్, టెక్స్‌బాల, గుంటూరు కృష్ణ, తట్టుకుళ్ళ ఆశోక్‌యాదవ్, బొమ్ము నాగిరెడ్డి, కుర్రా శ్రీను, జెబి.జిలానీ, వేజండ్ల శ్రీకాంత్, ఎన్‌ఆర్‌కె శర్మ, షేక్ గఫూర్, దేవరపల్లి కిషోర్, రాజ్‌కుమార్, గోల్డ్ రహమా, సయ్యద్ గౌస్, కాళిదాసు వెంకట సత్యం, ఉడుముల మహేష్‌రెడ్డి, కొమ్ము రాయల్, జిలానీ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శనివారం తెనాలి పట్టణంలోని పలు సచివాలయాలకు చెందిన 15మంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వాటిని సచివాలయ అడ్మిన్లకు అందజేశారు. నందులపేట- 1 సచివాలయ పరిధి లో 6, ఎన్వీఆర్ కాలనీ సచివాలయ పరిధిలో 5, పినపాడు-1 సచివాలయ పరిధిలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. రాజీనామాలను ఆమోదించినట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు.